

అభివృద్ధిలో అసమానతలు

- వివిధ రంగాల ప్రగతిలో వ్యత్యాసాలు
- తలసరి ఆదాయంలో జయశంకర్ మెరుగు.. హనుమకొండ అధమం
- జీడీపీపీలో హనుమకొండ ముందంజ.. జనగామ వెనుకబాటు
- పరిశ్రమల్లో ములుగు లాస్ట్.. పెట్టుబడుల్లో వరంగల్ ఫస్ట్
- ఆరు జిల్లాల అభివృద్ధిలో అసమతుల్యత
- ప్రజల జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావాలు
- స్పష్టం చేస్తున్న సామాజిక, ఆర్థిక గణాంకాలు

హనుమకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి అన్ని రంగాల్లో సమానంగా జరగడం లేదు. తలసరి ఆదాయం (పీసీఐ), స్థూల జిల్లా స్థాయి ఉత్పత్తి (జీడీడీపీ), పరిశ్రమల ఏర్పాటు, పంటల సాగు, భూకమతాలు తదితర అంశాల్లో తీవ్రమైన అసమానతలు కనిపిస్తున్నాయి. తలసరి ఆదాయంలో భూపాలపల్లి జయశంకర్ జిల్లా మెరుగైన స్థానం (12)లో ఉండగా, హనుమకొండ ఆఖరు స్థానం (32)లో ఉంది. స్థూల జిల్లా స్థాయి ఉత్పత్తి (జీడీపీపీ) విషయంలో హనుమకొండ జిల్లా కాస్త మెరుగైన స్థానం (16)లో ఉండగా, ములుగు జిల్లా మరీ అట్టడుగున 33వ స్థానంలో ఉంది. జిల్లాలో వ్యవసాయ రంగానికి అద్దంపట్టే భూకమతాల్లోనూ వ్యత్యాసాలు ఉన్నాయి. జనగామ జిల్లాలో సగటు భూకమతం 0.95 హెక్టార్లు ఉండగా, వరంగల్ జిల్లాలో మరీ తక్కువగా 0.74 హెక్టార్లు ఉంది. భూ వినియోగాన్ని ఎత్తిచూపే క్రాపింగ్ ఇంటెన్సిటీలోనూ తీవ్రమైన వ్యత్యాసం కనిపిస్తోంది. పరిశ్రమల ఏర్పాటులో కూడా తేడా మరీ ఎక్కువగా ఉంది. దీనిని బట్టి హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వివిధ రంగాల్లో అభివృద్ధిలో సారుప్యత లోపించి దాని ప్రభావం ప్రజల జీవన ప్రమాణాలపై పడుతోంది. ఇందుకు కారణం పాలకుల నిరక్ష్యం, అభివృద్ధి గురించి ప్రజాప్రతినిధులకు పట్టింపు లేకపోవడం, సమగ్రాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికల లేకపోవడం ప్రధాన కారణంగా ఆర్థికరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తలసరి ఆదాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తలసరి ఆదాయంలో రాణించలేకపోతోంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో సరైన తోడ్పాటు లేకపోవడం ప్రజల బతుకుతెరువుపై ప్రభావం చూపుతోంది. తలసరి ఆదాయం అనేది ఆర్థిక శాస్త్రంలో ప్రాథమిక కొలమానంలాంటిది. ఇది జనాభా జీవన ప్రమాణాలతో పాటు ఆర్థికాభివృద్ధి, సంపద పంపిణీ ఎలా జరుగుతుందనే అంశాలను వెల్లడిస్తుంది. సహజ సిద్ధమైన అటవీ, ఖనిజ సంపద, వ్యవసాయానికి అవసరమైన నల్లరేగడి, ఎర్రనేలలు, గోదావరి లాంటి జీవనోపాధులు ఉన్నప్పటికీ పాలకుల తోడ్పాటు కరువై ఫలితం లేకుండా పోతోంది.

మనది ఏ స్థానమంటే..

రాష్ట్ర ప్రభుత్వం ఏటా శాసన సభ బడ్జెట్ సమావేశాలకంటే ముందు రాష్ట్ర సామాజిక ఆర్థిక ముఖ చిత్రం వివరాలను క్రోడీకరిస్తుంది. దీని ఆధారంగా రాష్ట్రంలోని ఆర్థిక, సామాజికాభివృద్ధి, అత్యవసర సేవలు, కీలక ఆర్థిక నిర్ణయాలు తీసుకునేలా చర్యలకు ఉపక్రమించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ లెక్కన జాతీయ స్థాయిలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79751 ఉన్నట్టు తేలింది. రాష్ట్రంలో తలసరి ఆదాయంలో భూపాలపల్లి జయశంకర్ జిల్లా రూ.2,57851లతో 12వ స్థానంలో ఉన్నట్లు తేల్చింది. ములుగు జిల్లా రూ.2,49,338తో 15 స్థానంలో వరంగల్ జిల్లా రూ.2,44,278తో 17వ స్థానంలో జనగామ జిల్లా రూ.2,33,215తో 19వ స్థానంలో మహబూబాబాద్ జిల్లా రూ. 2,12,232తో 29వ స్థానంలో ఉండగా, హనుమకొండ జిల్లా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా రూ.1,99,490తో 31వ స్థానంలో ఉన్నది.

తగ్గిన వృద్ధి రేటు

అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా లభించే ఉపాధి అవకాశాలు, వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో కలిగే మౌలిక వృద్ధి రేటుకు అనుగుణంగా వ్యక్తుల తలసరి ఆదాయాన్ని లెక్కించటమనేది ఆర్థికాంశాల్లోని ప్రధాన పాత్ర. 2021-22, 2023-24 మధ్య ఆయా అంశాలను పరిగణలోకి తీసుకొని లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ (ఎల్ఎఫ్‌పీఆర్), వర్కర్ పాపులేషన్ రేషియో (డబ్ల్యుపీఆర్) చేసిన సర్వే ప్రకారం రాష్ట్ర వ్యవసాయం, దాని అనుబంధ రంగాల వృద్ధి రేటు 2022-23 కంటే 2023-24లో 5.71 శాతం తగ్గినట్టు తేలింది.

భూ కమతాలు

ఉమ్మడి జిల్లాలో సగటు భూ కమతాల పరిమాణం మారుతూ వస్తోంది. ఆరు జిల్లాల్లో ఒక్కలాగా లేదు. జనగామ జిల్లాలో సగటు భూకమతం ఎక్కువగా ఉంటే వరంగల్ జిల్లాలో మరీ తక్కువగా ఉంది. దీనికి స్థానిక వ్యవసాయ పరిస్థితులు, పద్ధతులే

మిగతా 7వ పేజీలో...

పరిగణించాల్సినవి ఇవీ..

ఉమ్మడి జిల్లాలో సాగు భూముల విస్తీర్ణం దాదాపు 16 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. సింహభాగం వర్షాధార పంటలే పండిస్తున్నారు. హనుమకొండ, వరంగల్ ప్రధానంగా వరి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో పత్తి, ములుగు, జయశంకర్ జిల్లాల్లో మిర్చి ఎక్కువగా సాగవుతుంది. దేవాదుల, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా నిర్ణీత గడువులో వానాకాలం చివరి దశకే నీళ్లు ఇవ్వటానికి సరిపోవడం లేదు. రూ.లక్ష కోట్ల వ్యయంతో కట్టిన కాళేశ్వరం ద్వారా ఆశించిన మేరకు అన్నదాతలకు సాగునీరు అందడం లేదు. పారిశ్రామికీకరణలో నిరాధారణ, ఉమ్మడి జిల్లా తలసరి ఆదాయం పెరగకపోవడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

జిల్లా స్థాయిలో స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)

స్థూల జిల్లా స్థాయి ఉత్పత్తి (జీడీడీపీ) రాష్ట్రం లోని వివిధ జిల్లాల సాపేక్ష ఆర్థిక పరిమాణాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగించే ముఖ్యమైన కొలమానం. జీడీపీపీ విషయంలో ములుగు జిల్లా మిగతా అన్ని రాష్ట్రాల కన్నా అధమ స్థానంలో ఉంది. హనుమకొండ జిల్లా కాస్త మెరుగ్గా 16వ స్థానంలో ఉంది. జీడీపీపీలో హనుమకొండ జిల్లా రూ.25,667 కోట్లతో 16వ స్థానంలో, వరంగల్ జిల్లా రూ.20,785కోట్లతో 22వ స్థానంలో మహబూబాబాద్ జిల్లా రూ.19,774 కోట్లతో 24వ స్థానంలో జనగామ జిల్లా రూ.14,669 కోట్లతో 28వ స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రూ. 12,932 కోట్లతో 32వ స్థానంలో ఉండగా, ములుగు జిల్లా అన్ని జిల్లాల కన్న తక్కువగా రూ.8,873 కోట్లతో ఆఖరు స్థానంలో ఉంది.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

హాజరవనున్న 3,449 మంది విద్యార్థులు

భూపాలపల్లిటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లన్నీ సిద్ధం చేశారు. జిల్లాలో 20 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. 3,449 మంది విద్యార్థులు రాయనున్నారు. వీరితోపాటు 395 మంది ఒకేషనల్ విద్యార్థులు కూడా పరీక్షలు రాయనున్నారని అధికారులు తెలిపారు. పటిష్ఠ పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నడుమ పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, వైద్యం సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇన్విజిలేటర్లతో పాటు సిట్టింగ్ స్కాడ్‌లను, ఫ్లైయింగ్ స్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి పరీక్షలు సజావుగా సాగడానికి జిల్లాలో 20 సెంటర్లలో ఒకరు చొప్పున సిట్టింగ్ స్క్వాడ్ చొప్పున ఏర్పాటు చేశారు అన్ని పరీక్ష కేంద్రాలలో 230 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ముగ్గురు సీ సెంటర్ కస్టోడియన్స్ పనిచేయనున్నారు. రెండు రూట్లు ఏర్పాటు చేయగా ఇద్దరు అధికారులు పర్యవేక్షించనున్నారు. అలాగే 2 ఫ్లైయింగ్ స్వాడ్‌లు ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. ఈ పరీక్షలకు 3,449 మంది విద్యార్థులు జనరల్ పరీక్షలు రాయనుండగా 395 మంది వొకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ఇందులో 1,725 మంది బాలురు, 1,724 మంది బాలికలు ఉన్నారు. 15 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట

- బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించాం
- మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం
- ఇఫ్తార్ విందులో మంత్రి శ్రీధర్‌బాబు



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ, సబ్ కలెక్టర్

కాటారం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మైనారిటీ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర 2025-2026 వార్షిక బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి రూ.3వేల కోట్లు కేటాయించామని తెలిపారు. మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో గురువారం సాయంత్రం మండలంలోని ముస్లింలకు ప్రభుత్వం ద్వారా అధికారికంగా ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలకు స్వయంగా పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఆయనతోపాటు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. భిన్నమతాలున్న దేశంలో మత సామరస్యాన్ని కాపాడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. ఈ ప్రాంతంలో షాదీఖానా, ఖబరస్తాన్ ఏర్పాటుతో పాటు పలు మజీద్‌లకు ప్రహరీలను ముస్లీంల కోరిక మేరకు నిర్మింపజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు అంగోత్ సుగుణ, నాయకులు కోట రాజబాపు, రాజేష్, లచ్చిరెడ్డి, రమేష్‌రెడ్డి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కోడెపాక రఘుపతి, ఎంఈవో (చిట్యాల)

ఫేస్ టు ఫేస్

'పది'లో వంద శాతం ఫలితాలు సాధిస్తాం

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య ఎంత ?

ఎంఈవో: మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలల్లో సెంటర్లను ఏర్పాటు చేశాం. 350 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు.

ఆంధ్రజ్యోతి: పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేశారు ?

ఎంఈవో: రెండు పరీక్ష కేంద్రాల వద్ద విదార్థులకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి : పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఎంఈవో: పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. సిబ్బంది ఎవరి వద్ద కూడా సెల్‌ఫోన్ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: వార్షిక పరీక్షల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నారు ?

ఎంఈవో: గతేడాది చిట్యాల మండలంలో 97.63 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తామని ఆశిస్తున్నాం. అందుకు అనుగుణంగానే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాం.

- చిట్యాల (ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సీఎం, మంత్రి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్

భూపాలపల్లిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సాధ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన గంటన్నర లోపే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో సానుకూల ప్రకటన చేసి తన చిత్తశుద్ధిని చాటుకున్నారని కొనియాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాల అభీష్టం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన కొనసాగుతోందని అన్నారు. ప్రధానంగా జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించిన ప్రభత్వం బీసీ కులగణన నిర్వహించి ఆ సామాజికవర్గానికి రిజర్వేషన్లు 42శాతానికి పెంచేలా అసెంబ్లీలో బిల్లు చేసిందని అన్నారు. ఎస్సీల 30ఏళ్ల కలను సాకారం చేసిందన్నారు. ఒకేరోజు రెండు చారిత్రక నిర్ణయాలు తీసుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. యావత్ భారత దేశానికే ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్లావత్ దేవన్, ముంజాల రవి, మధు, శ్రీనివాస్, సాంబమూర్తి, రవి, శ్రీను, కర్నాకర్, రవి, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి మండలంలో..

కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని నాగారం, గొల్లబుద్దారం, దూదేకులపల్లి, ఆముదాలపల్లి, కొంపల్లి, గూడాడ్‌పల్లి, గొర్లవీడు, నేరేడుపల్లి, మోరంచపల్లి ఎస్ఎం కొత్తపల్లి, శ్యామ్ నగర్ గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతీ పేదవాడికి అందేలా చూస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రూ. 4.73 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేపట్టినట్లు వివరించారు. అనంతరం అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలపడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే కోరారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గంజాయి, డ్రగ్స్ మహమ్మారి ప్రారంభ దశలోనే గుర్తించి నివారించాలని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి సంబంధిత సమాచారం తెలిస్తే వెంటనే 8712658111 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో మహిళ ఆత్మహత్య



సరిత (ఫైల్)

కన్నాయిగూడెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ఇనిగాల వెంకటేశ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మడగూడెం గ్రామానికి చెందిన సోలం కృష్ణ ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకుల గూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీ (కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్)గా పనిచేస్తున్నారు. భార్య సరిత (30), మూడేళ్ల కుమారుడితో ఇదే గ్రామంలో నివసిస్తున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో బుధవారం కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. దీంతో క్షణికావేశంలో పెరటి మొక్కలకు కొట్టే పురుగుల మందును సరిత తాగింది. దీంతో భర్త కృష్ణ ఆమెను ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే సరిత మృతి చెందింది. సరిత తల్లి సాగబోయిన రామక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సరస్వతీ పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లుండాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్
- కాళేశ్వరంలో పనుల పరిశీలన, పురోగతిపై సమీక్ష

వివరాలు 6లో..



గోదావరి ఘాట్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించండి

» రాజకీయ నేతలతో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితా రూపకల్పన, నవీకరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని అదనపు కలెక్టర్ సిహెచ్. మహేందర్‌జీ అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన గురువారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఓటరు జాబితా పరిశుద్ధత చాలా ముఖ్యమని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. గత సంవత్సరం నవంబరు నుంచి ఈనెల 18వ తేదీ వరకు నూతన ఓటరు నమోదుకు ఫారం-6 ద్వారా 1324 దరఖాస్తులు రాగా 1172 విచారణ పూర్తి చేశామని, 152 పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఫారం-7కు సంబంధించి 290 దరఖాస్తులు రాగా 94 విచారణ పూర్తి చేశామని, 196 పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. చిరునామా మార్పుకు 1295 దరఖాస్తులు రాగా 1061 విచారణ పూర్తయ్యాయని, 234 పెండింగ్‌లో ఉన్నాయని, కరెక్షన్ కోసం 1257 దరఖాస్తులు రాగా 916 విచారణ పూర్తయ్యాయని, 341 పెండింగ్‌లో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా తయారుకు రిటర్నింగ్ అధికారి ప్రతివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పార్టీల ప్రతినిధులు, బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించి జాబితా అందజేయాలని సూచించారు. ఫారం-7 ద్వారా నోటీస్ జారీ తదుపరి మాత్రమే ఓటుహక్కు తొలగించాలని, సుమోటగా తొలగించడానికి అవకాశం లేదన్నారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, రెండు ఓట్లు ఉన్న ఓటర్లను తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనేందుకు ముందుకు రావాలన్నారు. సమావేశంలో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సలీం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసాన్ని వినియోగించుకోవాలి

» విధులను అధికారులు నిర్లక్ష్యం చేయొద్దు

» పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



గాంధీనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



గురుకులంలో సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న విద్యార్థిని

కొత్తగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువవికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. గురువారం కొత్తగూడ, గాంధీనగర్, నరసనపల్లిలో ఆమె పర్యటించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు 57వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రూ.6వేల కోట్లతో రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. రూ.4లక్షలను సబ్సిడీలో ఇస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి తాను నిరంతరం పని చేస్తున్నానని, కానీ కొందరు అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థినులకు మాటిచ్చాం.. అమలు చేశాం..

ఇటీవల గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో నిద్ర చేసిన క్రమంలో విద్యార్థినులు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే.. నాడు పరిష్కరిస్తానని మాట ఇచ్చానని.. నేడు వాటిని అమలు చేశానని సీతక్క పేర్కొన్నారు. నీటి సమస్య ఉందంటే బోరు వేయించానని, కంప్యూటర్ ల్యాబ్ కావాలంటే జగతి ఫౌండేషన్ వారి సహకారంతో 20 కంప్యూటర్‌లతో ల్యాబ్ ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. పాఠశాలలో భవనాల మరమ్మతు పనుల కోసం రూ.28 లక్షల మంజూరు చేయించానన్నారు. నూతన భవనం నిర్మించేందుకు రూ.2కోట్లను మంజూరు చేయించానన్నారు. సాంకేతిక విద్యలేక ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు వెనుకబడి ఉన్నారు. వారందరికీ కంప్యూటర్ విద్యను అందించేందుకు ప్రతీ పాఠశాలలో కంప్యూటర్‌లను ఏర్పాటు చేసి సాంకేతిక విద్యను అందిస్తామన్నారు. కాగా, పాఠశాలలో సమస్యలు పరిష్కరించినందుకు ఒక విద్యార్థిని మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డు ప్రదర్శించడం ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, జగతి ఫౌండేషన్ ఆర్గనైజర్ దుర్గా, ప్రిన్సిపాల్ కల్పన, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

కొత్తగూడలో కుంజ రాము స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొగిలి, జిల్లా నాయకుడు వెంకన్న, మాజీ సర్పంచ్‌లు రణధీర్, రాజేశ్వర్, నాయకులు ప్రశాంత్ రెడ్డి, సమ్మయ్య, రాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో దేవాలయాలను సందర్శిస్తా..

ముఖాముఖి



సంధ్యారాణి
దేవాదాయ శాఖ
డిప్యూటీ కమిషనర్

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ప్రముఖ ఆలయాల నిర్వహణపై సమీక్ష ఎప్పుడు?

డిప్యూటీ కమిషనర్: ఉమ్మడి జిల్లాలోని దేవాలయాలను త్వరలోనే సందర్శించి నిర్వహణను పర్యవేక్షించి సమీక్ష సమావేశం నిర్వహిస్తాను.

ఆంధ్రజ్యోతి: ఆలయాల ఆడిటింగ్ ఎప్పుడు ప్రారంభం?

డిప్యూటీ కమిషర్: దేవాలయాలకు సంబంధించిన ఆడిటింగ్ ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తుండగా ఏప్రిల్ మాసం నుంచి ఆడిటింగ్ ప్రారంభమవుతుంది.

ఆంధ్రజ్యోతి: సరస్వతి పుష్కరాలపై శాఖాపరమైన నిర్ణయాలు ఏవి?

డిప్యూటీ కమిషనర్: మే మాసంలో కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ హైదరాబాద్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా ప్రారంభమయ్యాయి.

ఆంధ్రజ్యోతి: ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణపై శాఖాపరమైన ఆదేశాలు ఏమైనా ఉన్నాయా?

డిప్యూటీ కమిషనర్: యేటా ఉగాది పర్వదినం వేడుకల సందర్భంగా పూజా కార్యక్రమాలు, పంచాంగ శ్రవణాలు, శ్రీరామనవమి సందర్భంగా కల్యాణోత్సవాలు యథావిధిగా జరుగుతాయి. ఇందుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ఏదీ శాఖాపరంగా ఆదేశాలు ఏమీ లేవు.

ఆంధ్రజ్యోతి: దేవాదాయ శాఖలో ఉన్న సిబ్బంది కొరతను ఎలా తీరుస్తారు?

డిప్యూటీ కమిషనర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదాయ శాఖకు సంబంధించి పలువురు సిబ్బంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇప్పటికే కొరత ఉండగా మరికొంత మంది సిబ్బంది విరమణతో సిబ్బంది కొరత మరింతగా ఏర్పడే అవకాశం ఉంది. వీటి వివరాలు సేకరించి కమిషనర్‌కు తెలియజేయడం జరుగుతుంది.

- వరంగల్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

జిల్లా సరిహద్దులో పులుల సంచారం

- **పెగడపల్లి రేంజ్ అడవులను దాటిన మగపులి**
- **దూదేకులపల్లి పరిధిలో ఆడపులి జాడలు!**



కాటారం రేంజ్ అడవుల్లో పులిజాడ కోసం గాలిస్తున్న అధికారులు

కాటారం/మహాముత్తారం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కాటారం అటవీశాఖ రేంజ్ అడవుల నుంచి మగ పులి పెగడపల్లి రేంజ్ అడవులను దాటి భూపాలపల్లి, ములుగు జిల్లాల సరిహద్దు అడవుల్లో సంచరిస్తోంది. గురువారం పలువురు అటవీ అధికారులు, సిబ్బందితో కూడిన పలు బృందాలు కాటారం, మహదేవపూర్ రేంజ్‌ల పరిధిలోని అడవుల్లో పులి జాడ కోసం విస్తృతంగా గాలించారు. వారికి పులికి సంబంధించిన ఆనవాలు కనిపించలేదు. పులి కాటారం రేంజ్ పరిధిలోని అడవుల నుంచి పెగడపల్లి రేంజ్ అడవులను దాటి జిల్లా సరిహద్దు అడవుల వైపు వెళ్లినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు అడవుల్లోని కాలిబాట, కుంటలు, వాగుల గుండా పులి పాదముద్ర(పగ్‌మార్క్)లు కనిపించడంతో పులి సంచారాన్ని అటవీ అధికారులు ధృవీకరించారు. అలాగే అడవుల్లో పులి అడవిపందిపై దాడి చేసినట్లు తెలుస్తోంది. మరో వైపు గత వారం రోజులుగా మేడిపల్లి, రాంపూర్ అడవుల్లో సంచరించిన ఆడపులి సైతం అక్కడి నుంచి దూదేకులపల్లి రేంజ్ పరిధిలోని వెన్నెల మడుగు సెక్షన్, బలరామకృష్ణ మడుగు అడవుల్లోకి వెళ్లి అందులో సంచరిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అటవీ అధికారులు పులి పాదముద్రలను గుర్తించినట్లు తెలుస్తోంది. కాగా, పులుల పాదముద్రలు వేర్వేరుగా ఉండటంతో మగపులి, ఆడపులి 30-35 కిలోమీటర్ల మధ్య దూరంలో జిల్లా సరిహద్దు అడవుల వైపు సంచరిస్తున్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ములుగు జిల్లా అడవుల్లో మేటింగ్?

జిల్లాలో మహదేవపూర్, భూపాలపల్లి డివిజన్‌లోని పలు రేంజ్‌ల పరిధిలోని అడవుల్లో గత కొన్ని రోజులుగా వేర్వేరుగా సంచరించిన మగ, ఆడ పులులు జిల్లా సరిహద్దు అడవుల వైపుగా వెళ్తున్నాయి. దీంతో రెండు పులుల సంచారానికి మధ్య 30-35 కిలోమీటర్ల మేర అడవులు ఉండటంతో అవి రెండు, మూడు రోజుల్లో ఒకే ప్రాంతానికి చేరొచ్చని అటవీ శాఖ అధికారులు, టైగర్ ట్రాకర్స్, సామాన్య ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా సరిహద్దులను దాటి ములుగు జిల్లా అడవుల్లో పులుల మేటింగ్ జరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేమని అధికారులు అంటున్నారు. పులులు ములుగు జిల్లా అడవుల మీదుగా ఛత్తీస్‌గఢ్ అడవుల్లోకి కూడా వెళ్లే అవకాశం ఉందని, లేదా వెళ్లిన దారుల్లోనే తిరిగి వెనక్కి రావచ్చని టైగర్ ట్రాకర్స్ అభిప్రాయ పడుతున్నారు. పులులు సంచరించే అడవుల్లోకి ఎవరూ వెళ్లొద్దని, వాటికి హాని కలిగించొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. పులుల జాడ కోసం గాలింపు చర్యల్లో కాటారం, మహదేవపూర్, పెగడపల్లి ఎఫ్‌ఆర్వోలు స్వాతి, రవికుమార్, వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్, రాజేశ్వర్, లాయక్ హుస్సేన్, ఎఫ్‌ఎస్‌వోలు చంద్రశేఖర్, సుమన్, వరుణ్, లక్ష్మణ్‌రావు, ఎఫ్‌బీవోలు, ప్లాంటేషన్ వాచర్లు, బేస్‌క్యాంప్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



పెగడపల్లి రేంజ్ అడవుల్లో పులి పాదముద్ర

మేడారంలో భక్తుల సందడి



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సమ్మక్క-సారలమ్మల గద్దెలను దర్శించుకున్నారు. వనదేవతలకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 5వేల మందిఅమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు.

సరస్వతీ పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

» దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్



అధికారులతో మాట్లాడుతున్న శైలజా రామయ్యర్

మహదేవపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. గురువారం పనుల పరిశీలన, సమీక్ష నిర్వహించేందుకు కాళేశ్వరంవచ్చిన ఆమె దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఈవో కార్యాలయంలో సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. సరస్వతి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయింపు, వీఐటీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు రహదారి నిర్మాణం, శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. గోదావరి హారతికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వీఐపీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కర సమాచారం భక్తులకు తెలిసేలా ప్రత్యేక యాప్ రూపొందించాలని, ప్రచారానికి అంబాసిడర్‌ను నియమించాలని సూచించారు. పుష్కరాలు జరిగే 12 రోజుల కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని ఈవో మహేష్‌ను ఆదేశించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గోదావరి వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని చేయాలన్నారు. గోదావరిలో నీటి నిల్వలను పరిశీలించాలని, సత్రం పనులను పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు రక్షిత తాగునీరు అందుబాటులో ఉంచాలని, గోదావరిలోకి భక్తులు వెళ్లకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఆర్‌జేసీ రామకృష్ణారావు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర శాఖలు, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పులిగోపాల్‌రెడ్డినగర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... బాదావత్ భాస్కర్-మౌనిక(27) దంపతులు గత మూడేళ్లుగా పులిగోపాల్‌రెడ్డినగర్ కాలనీలో నివాసముంటున్నారు. భాస్కర్ పురుగు మందుల కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండ్రోజులుగా భార్యభర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన మౌనిక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త భాస్కర్ పనులు ముగించుకుని మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చే సరికి మౌనిక ఫ్యానుకు ఉరివేసుకుని ఉండడంతో ఖంగుతిన్నాడు. వెంటనే మౌనిక తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మౌనిక ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మౌనిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలు మౌనికకు భర్త భాస్కర్, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పెట్రోల్‌తో తహసీల్దార్ కార్యాలయంలో వ్యక్తి హల్‌చల్

- **భూ సమస్య పరిష్కరించడం లేదంటూ ఆరోపణ**
- **ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్‌పై పడిన పెట్రోల్**
- **పోలీసులకు అధికారుల ఫిర్యాదు.. హత్యాయత్నం కేసు నమోదు**
- **భూపాలపల్లి జిల్లా మల్హర్‌లో ఘటన**



పెట్రోల్ చల్లిన వ్యక్తి శంకర్

పక్కకు పడేసిన బాటిల్

మల్హర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తన భూ సమస్యను పరిష్కరించాలంటూ పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం చేయడం లేదంటూ భూపాలపల్లి జిల్లా మల్హర్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓ వ్యక్తి పెట్రోల్ సీసాతో హల్‌చల్ చేశాడు. మల్హర్ మండలం వల్లెంకుంట గ్రామానికి చెందిన నార శంకర్ గురువారం పెట్రోల్ బాటిల్‌తో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. పదేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తన భూ సమస్యను పరిష్కరించడం లేదంటూ పెట్రోల్‌ను ఆర్ఐ టేబుల్‌పై చల్లాడు. దీంతో ఆర్ఐ రాజశేఖర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ కీర్తనపై పెట్రోల్ పడింది. వెంటనే అప్రమత్తమైన అక్కడున్న వారు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా వారి నుంచి తప్పించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. అనుకోకుండా జరిగిన ఘటన నుంచి తేరుకున్న రెవెన్యూ అధికారులు కొయ్యూర్ పోలీసులకు సమాచారం అందించగా.. సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో శంకర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అయితే గతంలో కూడా శంకర్ ఇలాగే కార్యాలయానికి వచ్చి అధికారులు, సిబ్బందిని ఇబ్బందులకు గురి చేశాడని అధికారులు తెలిపారు. కాగా దాడికి పాల్పడిన వ్యక్తికి గానీ, అతడి కుటుంబానికి గానీ ఎలాంటి భూమి లేదని చెబుతున్నారు. ఇదిలా ఉంటే శంకర్‌కు మతిస్థిమితం సరిగా ఉండదని స్థానికులు చెబుతున్న క్రమంలో తన భూ సమస్య పరిష్కారం చేయడం లేదంటూ అధికారులపై దాడికి యత్నించడం తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రారంభం కాని మొక్కజొన్న కేంద్రాలు

» ప్రైవేట్‌ను ఆశ్రయించి నష్టపోతున్న రైతులు

» మద్దతు ధర రూ.2500 ఇవ్వాలని డిమాండ్



హచ్చుతండాలో యంత్రంతో మొక్కజొన్న గింజలు పడుతున్న రైతులు

తొర్రూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మొక్కజొన్న పంట కోతదశ ప్రారంభమై చేతికి వచ్చినా.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. దీంతో రైతులు తమ పంటను ప్రైవేట్ దళారులకు విక్రయించుకొని నష్టపోతున్నారు. తొర్రూరు పీఏసీఎస్ పరిధిలోని తొర్రూరు మండలంలో 9,500 ఎకరాలు, పెద్దవంగర మండలంలో 11,200 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. గతంలో మార్చి ప్రారంభం నుంచి మొక్కజొన్న కేంద్రాలు ప్రారంభమై మద్దతు ధరతో కొనుగోళ్లు జరిగేవి. ప్రస్తుతం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయనే భరోసాను అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు కల్పించడం లేదు. ఇప్పటికే సాగునీటి సమస్యతో పంట ఎండిపోతున్నా అష్టకష్టాలు పడుతూ చేతికి వచ్చిన పంటను కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌లో రూ.2,225 చొప్పున కొనుగోలు జరుగుతుండగా, ప్రైవేట్ దళారులకు క్వింటాకు రూ.1,900 నుంచి రూ.2,050 వరకు విక్రయించుకోవాల్సి వస్తుంది. దీంతో సుమారు క్వింటాకు రూ.200 వరకు రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, క్వింటాకు మద్దతు రూ.2,500 చొప్పున కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరుకాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి కేంద్రాలు లేకపోవడంతో దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఎకరం సాగుకు దుక్కి దున్నడం నాటి నుంచి మందు బస్తాలు, కోతదశ వరకు సుమారు రూ.15వేలు నుంచి రూ.20వేలు పెట్టుబడి వస్తుంది. దీంతో ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని.. దీంతో దళారులకు విక్రయించడంతో రూ.10వేల వరకు నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర రూ.2500 చొప్పున కొనుగోళ్లు చేసి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



అమ్మాపురంలో సాగు చేసిన మొక్కజొన్న పంట

రూ.2,500 చొప్పున కొనుగోలు చేయాలి

గుగులోతు కిషన్, రైతు హచ్చుతండా, తొర్రూరు మండలం



ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మొక్కజొన్న పంటను రూ.2,500 చొప్పున కొనుగోలు చేయాలి. తనకు ఉన్న 5 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను పెట్టుబడి రూ.లక్ష వరకు వచ్చింది. సాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతూ పంట సాగు చేశాను. పంట చేతికి వచ్చినా విక్రయించుకుందాంటే కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు వచ్చి అడుగుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

మురళి, పీఏసీఎస్ సీఈవో, తొర్రూరు

తొర్రూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి ఇప్పటికే 4 కేంద్రాలకు ప్రతిపాదనలు పంపించాం. తొర్రూరు మండలంలో జమస్థాన్‌పురం, తొర్రూరు, పెద్దవంగర, ఔతాపురం గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నాం. ఆదేశాలు రాగానే కొనుగోళ్లు చేస్తాం.

సామాజిక చైతన్య ప్రేరణ.. కవిత

➡ ఓరుగల్లులో గుబాళిస్తున్న వచన కవిత్వం ➡ కాళోజీ మొదలు అక్షరమాలలు అందించిన వారెందరో..

నేడు ప్రపంచ కవితా దినోత్సవం

హనుమకొండ కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యానికి ప్రేరణ.. గాయపడిన గుండె నుంచి ఉప్పొంగే తరంగం.. ప్రేమికుల మది నుంచి జాలువారే సెలయేరు.. ఆనందాన్ని పదిలపరిచే ఓ మధుర జ్ఞాపకం.. హక్కుల కోసం ఆక్రోశించే సముద్రఘోష.. సమస్త దేవతలను స్తుతించే మంత్రం.. ప్రకృతి ఆరాధకులకు కనివిందు కవిత.. అంటూ తెల్లకాగితాలు అక్షర బరువుతో కొత్త అందాలు సంతరించుకుంటున్నాయి. యావత్ ఓరుగల్లులో అనాది కాలం నుంచి వందలాది మంది కవులు తమ సాహిత్య సృజనతో చైతన్యాన్ని గుబాళింపజేస్తున్నారు. ఏటా మార్చి 21న ఐక్యరాజ్య సమితి సార్వత్రిక కవితాదినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని సాహితీ ప్రియులు వైభవంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా నగరంలో పలు కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.

కాళోజీ స్ఫూర్తితో..

ఆధునిక తెలంగాణ కవిత్రయంలో ఒకరిగా పేరొందిన కాళోజీ నారాయణరావు మొదలు వరవరరావు, పేర్వారం జగన్నాథం, మాదిరాజు రంగారావు, ఆచార్య బన్న ఐలయ్య, వీఆర్.విద్యార్థి, రామా చంద్రమౌళి, డాక్టర్ ఎల్ఎస్ఆర్‌కే ప్రసాద్, పొట్లపల్లి శ్రీనివాసరావు, సిరాజొద్దీన్, అనిశెట్టి రజిత, దేవులపల్లి వాణి, నెల్లుట్ల రమాదేవి, బాలబోయిన రమాదేవి ఇలా ఎందరో కవుల ప్రస్థానం ఓరుగల్లు నేలపై అప్రతిహతంగా కొనసాగుతోంది. కాళోజీ స్ఫూర్తితో మొదలైన వచన కవితా ప్రస్థానం పేర్వారం తెలుగు సాహిత్యంలో అధిక్షేప కవిత్వాన్ని సమర్థవంతంగా రాసిన కవిగా ప్రసిద్ధుడు. విప్లవ కవిగా పేరొందిన వరవరరావు 1968లోనే చలినెగళ్లు గొప్ప వచన సంపుటిని వెలువరించారు. ఆ తర్వాత ఆయన కలం నుంచి అనేక వచన కవిత సంపుటాలు వెలువడ్డాయి. కేయూ ఆచార్యులుగా ప్రసిద్ధి చెందిన బన్న ఐలయ్య మొదట మానవీయ కోణంలో 1988లో రాసిన రహస్య చిత్రం వచన కవిత సంపుటి మొదలు అనేక కావ్యాలు ఆవిష్కృతమయ్యాయి. వీఆర్. విద్యార్థి ఆధునిక తెలుగు కవితా ప్రపంచంలో సైనిక కవిగా, ఖండాంతర కవిగా ప్రసిద్ధి చెందిన ఆయన 1987లో అలలు పేరిట తొలి వచన కవిత సంపుటిని వెలువరించారు. అనంతర కాలంలో ఆయన కలం నుంచి మరో 9 కవిత సంపుటాలు వెలువడ్డాయి. హనుమకొండ బ్రాహ్మణ వాడకు చెందిన అడ్వొకేట్ నమిలిగొండ బాలకిషన్‌రావు జాతీయత , దేశ భక్తి కవిత వస్తువులుగా 1981లోనే యువ స్వరం పేరిట, 1987లో అక్షర చిట్ ఫండ్ కవిత సంపుటాలు వెలువడ్డాయి. పొట్లపల్లి శ్రీనివాసరావు 1981లో చైతన్య గులాబీలను గుబాళింపజేశారు. అనిశెట్టి రజిత సాహిత్యమే ఊపిరిగా ఉంటూ 1977లో నేనొక నల్ల మబ్బునవుతా కవిత సంపుటిని, 2000 సంవత్సరంలో ఓ లచ్చవ్వ దీర్ఘ కవితను వెలువరించి సాహితీ లోకంలో తనదైన ముద్ర వేసుకున్నారు. తక్కెళ్ల బాలరాజు వృత్తి రీత్యా డీటీవోగా విధులు నిర్వహించిన ఆయన 1974లో వెలుగురేఖలు వచన కవితను ప్రకటించారు. డాక్టర్ టి. శ్రీరంగ స్వామి మధుర వచన సంపుటితో 1984లో సాహితీ లోకానికి పరిచమై శ్రీలేఖ సాహితీ సంస్థ ద్వారా అనేకానేక సంపుటాలను వెలువరించి యువ రచయితలను ప్రోత్సహించారు. డాక్టర్ పల్లేరు వీరస్వామి 1982లో ఉషోదయం శీర్షికతో కవిత సంపుటిని వెలువరించారు.

బ్రహ్మ చారి నిధి కలంతో అభ్యుదయ దృక్పథంతో 1982లో స్పందన పేరిట వచన కవిత సంపుటిని వెలువరించారు. న్యాయవాది టి.జితేందర్‌రావు అలారం, అపరాజిత సామాజిక స్పృహతో వచన కవిత సంపుటి, ప్రొఫెసర్ వాసురెడ్డి భాస్కర్‌రావు, డాక్టర్ పెద్ది వెంకటయ్య, శీలం రాజేషం, వరిగొండ కాంతారావు, కె. రామ్మోహన్‌రాజు, వరంగల్ కేంద్రంగా ఆచార్య రామా చంద్రమౌళి, ఎల్ఎస్ఆర్‌కే ప్రసాద్, డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు, తదితర అనేక మంది ప్రముఖులు పలు కవిత సంపుటిలతో ఓరుగల్లు సాహితీ లోకాన్ని పునితం చేశారు.

నామాని సృజనాదేవి 2009లో హృదయ నేత్రంతో, బిల్లా మహేందర్ 2011లో పోరుగానంతో, మల్యాల మనోహర్‌రావు 1993లో వాస్తవంలోకి, కాంచనపల్లి రాజేందర్‌రాజు 1995లో మౌన జ్ఞాపకంతో, వనపర్తి పద్మావతి 2002లో అనురాగ వీచికలతో, వెలపాటి రామారెడ్డి కోటి గాయాల మౌన మంటూ 2010లో. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు వడ్డెబోయిన శ్రీనివాస్ 2004లో పడావు దీర్ఘ కవితతో, షేక్ హాజీనూరాని 2011లో సైరన్ కవిత సంపుటితో, మహేశ్వర నరేందర్‌రెడ్డి 2002లో ఉషస్సుతో, గుండెబోయిన శ్రీనివాస్ 2013లో గురితో, మాదారపు వాణిశ్రీ 2019లో మనసు పలికే, వకుల వాసు 2020లో వాసంత సమీరాలు, డాక్టర్ దేవులపల్లి వాణి 2016లో జ్ఞాపకాల చేదు బొక్కెన, కొమర్రాజు రామలక్ష్మి 1970లో స్నేహగానం, గట్టు రాధిక 2019లో ఆమె తప్పిపోయింది, మేకిరి దామోదర్ పహరా లాంటి వచన కవితలతో ఓరుగల్లు నగరంలో సాహిత్య గుబాళింపులను పదిలపర్చారు. ఇంకా వీరితో పాటు అనేక మంది డాక్టర్ ఎన్వీఎన్ చారి, శంకేసి శంకర్‌రావు, రామా రత్నమాల, మెరుగు అనురాధ, శనిగరపు రాజమోహన్, డాక్టర్ జరినా బేగం, దండ్రె రాజమొగిళి, సొన్నాయిల కృష్ణ వేణి, ఏరుగొండ నర్సింహులు, కామిడి సతీష్‌రెడ్డి, బండారు సుజాత, నల్లెల్ల రాజయ్య, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు లాంటి కవులెందరో కవిత్వం రాస్తూ కాకతీయులు నడయాడిన ఓరుగల్లు గడ్డను సాహితీ క్షేత్రంగా సుసంపన్నం చేస్తున్నారు. ఇప్పటికి ప్రతీ ఏటా వివిధ సంస్థలు నిర్వహించే కవి సమ్మేళనాలు, ఉగాది కవి సమ్మేళనాల్లో కవులంతా ఉత్సాహంగా పాల్గొంటూ సాహిత్య సృజనతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్నారు.





ఆకాశవాణి కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు (ఫైల్)

ఆకాశవాణి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి వరంగల్ కేంద్రం కవితా ఓ కవితా శీర్షికన 9 మంది కవులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనాన్ని శుక్రవారం ఉదయం 9గంటలకు తమ ఆకాశవాణిలో ప్రసారం చేస్తున్నట్లు వరంగల్ ప్రోగ్రాం హెడ్ ఇల్లందుల రవికుమార్ తెలిపారు. పద్య, వచన, గేయ, నాని కవితలతో ఎండి సిరాజొద్దీన్, ఎం. బ్రహ్మచారి, ఎన్‌వీఎన్‌చారి, తాళ్లపల్లి యాకమ్మ, తిరునగరి నరేందర్, ఐతా శ్రీనివాస్, డాక్టర్ జయవీర్ రాజ్, వకుళ, షేక్ హజీనురానీ కవి సమ్మేళనంలో పాల్గొంటారని చెప్పారు. అడవి రాజబాబు, అనిల్ ప్రసాద్ కార్యక్రమ సంయోజకులుగా వ్యవహరించినట్లు ఆయన చెప్పారు.

పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో..

ప్రపంచ కవిత దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని అశోక కాన్ఫరెన్స్ హాల్‌లో పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ జగదీష్‌బాబు, సిరాజొద్దీన్ తెలిపారు. ప్రొఫెసర్ సురేష్‌లాల్‌తో పాటు డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, రవికుమార్, అంపశయ్య నవీన్, సైబర్ క్రైం ఏసీపీ కె. విజయ్‌కుమార్ తదితరులు అతిథులుగా పాల్గొంటారని వంద మంది కవులు సమ్మేళనంలో పాల్గొంటారన్నారు.

ఈ-పాస్‌లో నమోదవ్వని నీట్ పీజీ ప్రవేశాల డాటా

- స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్న విద్యార్థులు
- పీజీ అడ్మిషన్లు పూర్తయి రెండు నెలలు
- దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 31 చివరి తేదీ
- కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం
- ఇప్పటికైనా ఈ-పాస్‌కు డాటా అందజేయాలని విద్యార్థుల విజ్ఞప్తి



హనుమకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నీట్ పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి రెండు నెలలవుతున్నా ఈ-పాస్‌కు సంబంధించిన డాటాను అందజేయకపోవడమే ఇందుకు ఉదాహరణ. దీనితో పీజీ వైద్య విద్యార్థులు స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారు. ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోలేకపోతే వారు స్కాలర్‌షిప్పులను కోల్పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా వారు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉంది. వివరాల్లోకి వెళితే...

ప్రవేశాలు పూర్తయి రెండు నెలలైనా..

కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ (కేఎన్ఆర్‌హెచ్)లో నీట్ పీజీకి సంబంధించిన వివిధ వైద్య కోర్సుల్లో తెలంగాణ వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ రెండు నెలల క్రితమే పూర్తయింది. రాష్ట్రంలోని వివిధ మెడికల్ కాలేజీల్లో చేరిన విద్యార్థుల ప్రవేశాల వివరాలను కేఎన్ఆర్‌హెచ్ యూనివర్సిటీ ఈ-పాస్‌కు అందచేయాలి. వివరాలను ఈ-పాస్‌లో పొందుపరిస్తేనే విద్యార్థులు స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దరఖాస్తుల దాఖలుకు ఈనెల 31 చివరి తేదీ. వాస్తవానికి డిసెంబర్ 31 చివరి తేదీ అయినప్పటికీ, ప్రవేశాల ప్రక్రియ పూర్తికానందు వల్ల మార్చి 31 వరకు పొడిగించారు. అయితే హెల్త్ యూనివర్సిటీ అధికారులు ఈ పాటికే ప్రవేశాల వివరాలను సెంటర్ ఫర్ గుడ్ వర్నెన్స్ ఆధ్వర్యంలోని ఈ-పాస్‌కు అందచేయాలి. కానీ ఇప్పటి వరకు వారు దీని గురించి పట్టించుకోనేలేదు. దీనితో వివిధ ఎండీ, ఎంఎస్, క్లినికల్, నాన్ క్లినికల్ పీజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులు స్కాలర్‌షిపుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేకుండా పోయింది.

ఆర్థికంగా నష్టం

స్కాలర్‌షిప్పులు ఒక్కో కోర్సును బట్టి ఏడాదికి రూ. 2 లక్షలు, రూ. 3 లక్షల వరకు వస్తుంది. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు ప్రతీ నెల స్టయిఫండ్ కింద రూ. 3 వేల వరకు వస్తుంది. పేద విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్పులపై ఆధారపడే చదువుకుంటారు. స్కాలర్‌షిపును కోల్పోతే ఆర్థికంగా వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. కేఎన్ఆర్‌హెచ్ అధికారులు బీఎస్సీ నర్సింగ్ వంటి అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుల ప్రవేశాల వివరాల వరకే ఇచ్చారు. పీజీకి సంబంధించి నిర్లక్ష్యం వహించారు. దీనితో పీజీ వైద్య విద్యార్థులు స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తు చేసుకోలేక పోతున్నారు. విశ్వవిద్యాలయం అధికారులు తక్షణమే స్పందించి నీట్ పీజీ ప్రవేశాల వివరాలను ఈ -పాస్‌కు అందచేయాలని విద్యార్థులు కోరుతున్నారు. దీనితో మార్చి 31వ తేదీలోగా తమకు స్కాలర్‌షిప్పు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. స్కాలర్‌షిప్పుల కోసం దరఖాస్తు చేసుకుంటే సాధారణంగా ఫీజు సంబంధిత మెడికల్ కాలేజీలకు నేరుగా చెల్లింపు జరుగుతుంది. స్టయిఫండ్ విద్యార్థుల ఖాతాలో జమ అవుతుంది. గడువులోగా దరఖాస్తు చేసుకోని పక్షంలో ఫీజు చెల్లించమని ప్రైవేటు మెడికల్ కాలేజీ యాజమాన్యాలు తమపై ఒత్తిడి చేసే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కెఎన్ఆర్‌హెచ్ యూనివర్సిటీ అధికారులు స్పందించాలని, ఈ పాస్‌కు నీట్ పీజీ అడ్మిషన్ల డాటాను అందచేయాలని అభ్యర్థిస్తున్నారు.

అభివృద్ధిలో అసమానతలు

(5వ పేజీ తరువాయి)

ప్రధాన కారణం. జనగామ జిల్లాలో సగటు భూకమతాల పరిమాణం సాపేక్షంగా 0.95 హెక్టార్లు ఉండగా, ములుగు జిల్లాలో 0.92 హెక్టార్లు, మహబూబాబాద్ జిల్లాలో 0.87 హెక్టార్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 0.85 హెక్టార్లు హనుమకొండ జిల్లాలో 0.75 హెక్టార్లు, వరంగల్ జిల్లాలో మరీ తక్కువగా 0.74 హెక్టార్లుగా కలిగి ఉంది. ఈ ధోరణి ఉమ్మడి జిల్లాలో తరహా వ్యవసాయం లేదా విభిన్న భూవినియోగ పద్ధతులను సూచిస్తోంది.

పంట విస్తృతి

పంటల సాగు విస్తృతి (క్రాపింగ్ ఇంటెన్సిటీ) విషయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలో కన్నా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఈ జిల్లాలో ఏడాడిలో మూడు సార్లు భూమిని వినియోగంలోకి తెస్తున్నారు. ములుగు జిల్లాలో పంటల సాగు విస్తృతి 293 శాతంతో ప్రథమ స్థానంలో, మహబూబాబాద్ జిల్లా 183 శాతంతో 6వ స్థానంలో హనుమకొండ 182 శాతంతో 7వ స్థానంలో వరంగల్ జిల్లా 176 శాతంతో 10వ స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా 153 శాతంతో 18వ స్థానంలో జనగామ 145 శాతంతో 21వ స్థానంలో ఉంది.

పారిశ్రామీకరణ

ఉమ్మడి జిల్లా పారిశ్రామికంగా బాగా వెనుకబడింది. 70 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారంగా ఉంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుపడడంలో దోహదపడేది వ్యవసాయం తర్వాత పరిశ్రమలే. ఆరు జిల్లాలో పారిశ్రమల ఏర్పాటు సమాన స్థాయిలో జరగలేదు. యూనిట్లు, పెట్టుబడులు, ఉపాధి కల్పన విషయంలో తీవ్రమైన అసమానత స్పష్టంగా కనిపిస్తోంది. పారిశ్రామిక యూనిట్ల సంఖ్యలో హనుమకొండ జిల్లా ముందున్నప్పటికీ పెట్టుబడులల్లో వెనుకబాటు కనిపిస్తోంది. కాగా, వరంగల్ జిల్లాలో పారిశ్రమ యూనిట్లు తక్కువగా ఉన్నా పెట్టుబడులు ఎక్కువగా ఉండి ఉపాధి అవకాశాల కల్పన కూడా ఆ స్థాయిలో ఉండడం ఇందులో ప్రత్యక్ష ఉదాహరణ. హనుమకొండ జిల్లాలో రూ.445 కోట్ల పెట్టుబడులతో 831 యూనిట్లు ఏర్పాటు కాగా, 9,472 మంది ఉపాధి పొందుతున్నారు. వరంగల్ జిల్లాలో రూ.1,555కోట్ల పెట్టుబడులతో 494 యూనిట్ల స్థాపన జరగ్గా 16,683 మంది ఉపాధి పొందుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో రూ.561కోట్ల పెట్టుబడులతో 457 యూనిట్లు ఏర్పడగా కేవలం 4,367 మందికి ఉపాధి లభిస్తోంది. జనగామ జిల్లాలో రూ 552 కోట్ల పెట్టుబడులతో 396 యూనిట్లు ఏర్పాటు కాగా, 4,894 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేవలం రూ 82 కోట్ల పెట్టుబడులతో 162 యూనిట్లు ఏర్పడగా 2,227 మంది, ములుగు జిల్లాలో అతితక్కువగా రూ.37 కోట్ల పెట్టుబడులతో 93 పరిశ్రమలు ఏర్పాటు కాగా 818కి పని లభిస్తోంది.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

» కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం » ఘనంగా రూబిజెస్ట్ వేడుకలు



రూబీజెస్ట్ వేడుకల్లో రిజిస్ట్రార్ రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థినులు సమర్థవంతంగా రాణించి ఉజ్వల భవిష్యత్ పొందాలని కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం పిలుపునిచ్చారు. గురువారం కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల రూబీజెస్ట్-25 వేడుకలను పురస్కరించుకుని వర్సిటీ ఆడిటోరియంలో విద్యార్థినుల సదస్సు జరిగింది. కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుల్లో రిజిస్ట్రార్ రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, సమస్యలచ్చినప్పుడు కుంగిపోవద్దని ఉద్బోధించారు. వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. రూబీజెస్టు కన్వీనర్ సాయి తరుణ్ మాట్లాడుతూ.. రూబీజెస్టు ఉత్సవాల్లో భాగంగా టెక్నికల్, కల్చరర్ ఈవెంట్లు నిర్వహిస్తామని చెప్పారు. క్లాస్‌రూమ్ టీచింగ్‌లో నేర్చుకున్న వివిధ సాంకేతిక అంశాలను టెక్నికల్ ఎగ్జిబిట్ల ప్రదర్శనలు నిర్వహిస్తామని చెప్పారు. రూబీజెస్టు ఈవెంట్లకు కంప్యూటర్ సైన్స్ విభాగం ఫైనల్ ఇయర్ స్టూడెంట్ సాత్విక కోఆర్డినేటర్‌గా వ్యవరించారు. విద్యార్థులు పలు ఆసక్తికరమైన ఈవెంట్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ తూర్పాటి వెంకటేశ్, సూపరింటెండెంట్ బానోత్ వీరన్ననాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

23న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వడ్డెపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఈ నెల 23న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా సెక్రటరి సారంపల్లి వాసుదేవరెడ్డి తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌రావు, అభ్యుదయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సుంకరి వీరయ్య హాజరవుతారని తెలిపారు. 1970 నుంచి 2025 వరకు ఎస్ఎఫ్ఐలో క్రియాశీలకంగా పనిచేసిన విద్యార్థి నాయకులు, ప్రజాతంత్ర వాదులు తదితరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శులు తేలూరి ఉప్పలయ్య, రాగుల రమేష్, మేరుగు అశోక్, గానుపాటి గంగాధర్‌రెడ్డి, బీరెడ్డి సాంబశివ, దొగ్గెల తిరుపతి, గడ్డం రవి, మరిగిద్దె హరికిషన్ పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న వాసుదేవ రెడ్డి

ఆవిష్కరణలకు పరిశోధనలే మూలం

» వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి
» నిట్‌లో అసెంట్ అంతర్జాతీయ సదస్సు షురూ

హనుమకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలకు నిరంతరం జరిగే పరిశోధనలే మూలం అని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. గురువారం వరంగల్ నిట్‌లో అసెంట్-2025 అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ప్రొఫెసర్ సుబుధి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ స్థాయిలో నిబద్ధతతో పరిశోధనలు జరిగినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. భారత దేశం 20270 నాటికి నెట్ జీరో లక్ష్యాన్ని సాధించడానికి పరిశోధకుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఐఐసీహెచ్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ పరాగ్ గొగాటే మాట్లాడుతూ.. బయోఫ్యూయెల్ ఉత్పత్తిలో ప్రాసెస్ ఇంటెన్సిఫికేషన్, స్థిరమైన ముడిపదార్థాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పరిశోధనల్లో పరిశ్రమ - అకడమిక్ భాగస్వామ్యాన్ని మెరుగుపర్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఇంధన నిల్వ పదార్థాలు, నానో సాంకేతికత, అధిక సామర్థ్యం గల పదార్థాలు అనే అంశంపై ప్రసంగించారు. పరిశోధనలు, సాంకేతికతల భవిష్యత్తు స్థిరమైన అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తాయో వివరించారు.



పరాగ్ గొగాటేకు జ్ఞాపికను అందిస్తున్న బిద్యాధర్ సుబుధి

అసెంట్-2025 కార్యనిర్వాహక కన్వీనర్ డాక్టర్ కేఎస్ రాజమోహన్ తన స్వాగతోపన్యాసంలో విభిన్న రంగాల్లో పరిశోధన, సహకారంతో స్థిరమైన పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ప్రొఫెసర్ ఎస్.విద్యాసాగర్ పరిశ్రమల పురోగతికి నిట్‌లోని రసాయన శాస్త్ర విభాగం చేస్తున్న కృషిని వివరించారు. సదస్సు కన్వీనర్లు డాక్టర్ కెఎస్ రాజమోహన్, డాక్టర్ ఏ లీలా మనోహర్, డాక్టర్ రమ్య ఆరగా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెంట్-2025 పరిశోధనా సావనీర్‌ను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 200 మంది పరిశోధకులు ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్నారు.

దండికారణ్యం

- 64 శాతం అడవులతో రాష్ట్రంలోనే ములుగు జిల్లా మొదటి స్థానం
- ఎకో టూరిజంతో ఆకట్టుకుంటున్న వనాలు
- అడుగడుగునా అరుదైన జంతు, వృక్ష జాతులు, మూలికలు

నేడు ప్రపంచ అటవీ దినోత్సవం


ములుగు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పచ్చని వనాలు 'దండి'గా ఉన్న ములుగును దండకారణ్యానికి ముఖద్వారంగా పిలుస్తారు. మొత్తం జిల్లా భూభాగంలో 64శాతం అడవులతో అలరారుతోంది ఈ ప్రాంతం. ఆకుపచ్చని వనం పర్యాటక అందాలను పులుముకొని ప్రకృతి ప్రేమికులను మైమరిపింపజేస్తోంది. తీరొక్క జంతు, వృక్షజాతులు, అమూల్యమైన మూలికలకు చిరునామాగా మారింది. అత్యధిక అటవీ విస్తీర్ణంతో రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచింది. ములుగు జిల్లా భౌగోళిక విస్తీర్ణం 3,881 చదరపు కిలోమీటర్లు కాగా అందులో 2,945 చ.కిలోమీటర్లు అడవే. అంటే.. సుమారు 64 శాతానికి పైగా అరణ్యం విస్తరించి ఉంది. పది మండలాలు ఉంటే ఏడు మండలాలు, 112 గ్రామపంచాయతీలు ఏజెన్సీ ప్రాంతంలోనే ఉండటం గమనార్హం. జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు సరిహద్దులుగా ఉన్న ఈ ప్రాంతం అడవుల జిల్లాగా ఖ్యాతి పొందింది. విస్తారమైన అడవులు ఉండటంతో అధిక వర్షపాతమూ ఇక్కడే నమోదవుతోంది. పూర్వం నిత్యం మేఘాలు (మొగులు) కమ్ముకుని ఉండటం వల్ల ఈప్రాంతం 'ములుగు'గా పిలవబడుతోంది.

అపారమైన వృక్ష సంపద

ములుగు అడవుల్లో అపారమైన వృక్ష సంపద దాగి ఉంది. కలపకు ఉపయోగించే టేకు, పెద్దేగి, జిట్రేగి, మద్ది లాంటి అనేక రకాల వృక్షజాతులు ఇక్కడ ఉన్నాయి. కాలక్రమంలో పోడు వ్యవసాయం, కలప స్మగ్లింగ్ ప్రభావంతో భారీ చెట్లు నరికివేతకు గుర య్యాయి. అయినా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటు న్న అడవి కొత్తగా చిగురిస్తోంది. మేడారం, మల్లూ రు, వాజేడు అడవుల్లో కంక వనాలు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. కర్బన ఉద్గారాల తో కలుషితమవుతున్న పర్యావరణాన్ని ఎప్పటిక ప్పుడు శుద్ధిచేయడంలో ఈ అడవి ముఖ్యపాత్ర పోషిస్తోంది. గతేడాది ఆగస్టులో ప్రకృతి వైపరీ త్యానికి మేడారం అడవుల్లో పుట్టిన రాకాసి గాలు లకు లక్షన్నరకుపైగా చెట్లు నేలకొరిగాయి. టోర్నడో తరహా ఈదురుగాలులు విరుచుకుపడి పెను విధ్వం సాన్ని సృష్టించాయి. అడవులే లేకుండా ఉంటే సుడిగా లులకు ఎన్ని గ్రామాలు నేలమట్టమయ్యేవోనన్న ఆందోళన, ఆవేదన కనిపించింది. అయితే ఒక్క ప్రాణికి కూడా హాని కలగలేదు. తల్లిగర్భాన్ని చీల్చుకున్న వనమాత జనావాసాలు దెబ్బతినకుండా కాపాడింది. అందుకే చరిత్రలో వీరవనితులుగా కీర్తించబడుతున్న మేడారం సమ్మక్క, సారలమ్మల ప్రతిరూపంగా కంకవనాన్ని కొలుచుకుంటున్నారిక్కడి జనం. దైవంలా భావిస్తూ సంరక్షించుకుంటున్నారు. వేసవిలో పుట్ల కొద్దీ పువ్వులనిస్తున్న ఇప్పచెట్లు అడవిబిడ్డల ఆకలి తీరుస్తూ అన్నపూర్ణగా కొలవడుతున్నాయి. వెంకటా పూర్ మండలం రామప్పలో అరుదైన కేన్ మొక్కలు కనిపిస్తాయి. మొత్తం తెలంగాణ రాష్ట్రంలో ఈజాతి మొక్కలు ఇక్కడే ఉన్నాయి. అయితే 51ఎకరాల ఈ సంరక్షణ ప్రాంతం అన్యాక్రాంతమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.



మంగపేట మండలం మల్లూరు ప్రాంతంలో విస్తరించిన అడవి



పచ్చని అడవి మధ్య గోవిందరావుపేట మండలంలోని లక్నవరం చెరువు

అడవిలో ఆహ్లాదం

పర్యావరణ సహిత పర్యాటక ప్రాంతంగా ములుగు అరణ్యం ప్రగతి సాధిస్తోంది. ఇప్పటికే లక్నవరం చెరువు, బొగత జలపాతాలు ప్రకృతి ప్రేమికులను అలరిస్తుండగా తాడ్వాయి మండలంలోని బ్లూబెర్రీ ఐలాండ్ కొత్తగా వెలుగులోకి వచ్చింది. ఎకో టూరిజం ప్రాజెక్టులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అభివృద్ధి చేస్తున్నారు.

మల్లూరు వనంలో మూలికలు

మంగపేట మండలం మల్లూరు గుట్టలపై విలువైన మూలికలున్నాయి. ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగించే 474 జాతుల మొక్కలను వృక్షశాస్త్ర నిపుణులు గుర్తించారు. అతుకుడు తీగ, నరమామిడి, ఫిరంగి, తెల్లమద్ది, అడవి మామిడి, పెదేరియా, డైసోలోబియం వంటి అనేక జాతులు ఇక్కడ విరివిగా లభిస్తున్నాయి. ఈ ఔషధ మొక్కల ప్రభావంతో సహజసిద్ధంగా ప్రవహించే చింతామణి జలధార శుద్ధజలంగా మారింది. ఇటీవల సైంటిస్టులు జరిపిన పరిశోధనలో ఇది స్పష్టమైంది. అత్యాధునిక ప్లాంట్లలో వడబోసిన నీళ్లకంటే మల్లూరు హేమాచల క్షేత్రంలో ప్రవహించే ఈ చింతామణి జలధార నీళ్ల స్వచ్ఛంగా ఉన్నాయని ప్రకటించారు.

అడవి దున్నల పుట్టినిల్లు..

పాకాల వన్యప్రాణి సంరక్షణ ప్రాంతం సరిహద్దుగా ఉన్న ములుగు జిల్లాలోని ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ ప్రాంతం అరుదైన అడవి దున్నలకు స్థావరంగా మారింది. దట్టమైన నల్లమల అడవులను కాదని ఈ వన్యప్రాణి ఇక్కడ మనుగడ సాగిస్తోంది. మందలు మందలుగా పెరిగిపోయి తమ సంతతిని పెంచుకుంటున్నాయి. కొమ్ముల దుప్పులు, కనుజు, జింకలు, అడవిపందులు, కుందేళ్లు, కొండ గొర్రెలు లాంటి పలు జాతుల జంతువుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే అడవి సరిహద్దులోని పంటపొలాలకు కరెంటు తీగల కంచెలు వాటికి ప్రాణ సంకటంగా మారాయి.

అడవులను కాపాడుకోవాలి

డాక్టర్ సుతారి సతీష్, వృక్షశాస్త్ర పరిశోధకుడు

మానవ మనుగడకు అటవీ సంపద ప్రధానమైంది. వాటిని కాపాడుకుంటేనే మనం మనుగడ సాగించగలం. ములుగు ప్రాంతంలో అపారమైన సహజవనరుల దోపిడీకి గురవుతున్నాయి. దీనిని అరికట్టాల్సిన అవసరం ఉంది. మొత్తం భూభాగంలో 33శాతం అడవులుండాలి. రాష్ట్రంలో 18 శాతమే ఉండటం ఆందోళనకరం.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ

ములుగు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎవరైనా అక్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శబరీశ్ హెచ్చరించారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చనే భ్రమలో యువత, విద్యార్థులు అక్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు అలవాటుపడి సైబర్ మోసగాళ్ల ఉచ్చులోపడి డబ్బులు కోల్పోయి, అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్‌కు పాల్పడినా, గేమ్‌లు ఆడినా, వారికి ప్రోత్సహించిన వ్యక్తులపై చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా వేదికగా ఎవరిపైనా ప్రచారం చేస్తే ఉపేక్షించేదిలేదని, జిల్లా ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ చుట్టుపక్కల ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

పదోతరగతి వార్షిక పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ శబరీశ్ పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్‌శాఖ అన్నిరకాల పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో 21పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా కేంద్రాల్లో 3134 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జీరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లను మూసివేయాలని, పరీక్ష కేంద్రానికి 200మీటర్ల వరకు ప్రజలు గుమికూడి ఉండవద్దని అన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్ తీసుకురావాలని, సెల్‌ఫోన్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, కాలిక్యులేటర్, తదితరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేముందు ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసులకు విద్యార్థులు సహకరించాలని ఎస్పీ సూచించారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై హర్షం

వాజేడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్త మైంది. మండలంలోని ధర్మవరంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లె డెనార్జునరావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరరాపు సర్వేశ్వరరావు, నాయకులు ధనిశెట్టి రాంబాబు, మురహరి, కట్ల నరసింహ చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రేగొండలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

• భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ చిత్రపటాలకు యూత్ కాంగ్రెస్ నేతలు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్. బడితల ప్రసాద్, అఖిల్, అజయ్, రాజు, తిలక్, ప్రేం, తరుణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

• రేగొండ (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టినందుకు కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులుమందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సన్న, కాంగ్రెస్ నాయకులు పున్నం రవి, కిరణ్ ్‌పటేల్, వెంకటస్వామి, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మైస రమేష్, ఎంఆర్‌పీఎస్ నాయకులు చిలువేరు సంపత్, బొట్ల సుధాకర్, కొలెపాక సాంబయ్య, రొంటాల రఘుపతి, భిక్షపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, క్రాంతికుమార్, చంద్రయ్య, సవేందర్, రాజమ్మ, మహేష్, సతీష్, ఆంజనేయులు, దుర్గప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీగ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్, నాయకులు రఘురాం, చీమల రాజు, కుంభం రమేష్‌రెడ్డి, మాధవరెడ్డి, కొట్టె ప్రభాకర్, అంగజాల అశోక్, దుర్గం రాజబాబు పాల్గొన్నారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అసెంబ్లీలో బీసీ, ఎస్సీ రిజర్వేషన్ బిల్లులు ఆమోదించడం పట్ల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, నాయకులు పింగిలి జ్యోతి, లక్ష్మి, శంకర్, రవి, బుర్ర శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, బుర్ర లక్ష్మణ్ పాల్గొన్నారు.

• టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు వైనాల రవీందర్, తిప్పిరెడ్డి కృష్ణరెడ్డి, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, వివర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు సంపత్, మండల ఉపాధ్యక్షులు మాదం కోంరయ్య, మోతె రాజమౌళి, ప్రధాన కార్యదర్శులు దాసారపు సదానందం, బండి రవీందర్, జిల్లా నాయకులు దొంతుల శ్రీనివాస్, గట్టయ్య, సంపత్, టౌన్ అధ్యక్షుడు పెరుమాండ్ల క్రాంతి పాల్గొన్నారు.

• మహాముత్తారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ నాయకులు సడువలి, వంశీ, దుర్గయ్య , దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఆవరణలో బీసీ కుల ఐక్య వేదిక అధ్యక్షుడు సముద్రాల తిరుపతి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరభిషేకం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్, బీసీ సంఘాల నాయకులు బింబిరి దేవరావు, సట్ల మురళి, గడ్డం స్వామి, తిరుపతి, అబీబ్, సతీష్, తడకల జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

• మొగుళ్లపలి (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్‌గౌడ్, నాయకులు తక్కళ్లపల్లి రాజు, ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, క్యాతరాజు రమేష్, నడిగోటి రాము, మంద స్వామి, బొల్లపల్లి రాములు, ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రక్తహీనతపై గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. ములుగులో శుక్రవారం సికిల్‌సెల్ ఎనిమియాపై వైద్యులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. రక్తహీనత వ్యాధి అనువంశికంగా సంక్రమింపచేసే వ్యక్తులు, వివాహాల వల్ల కలిగే సంతానానికి వ్యాప్తి చెందుతుందని అన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను అవలంబించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టొచ్చని అన్నారు. రక్తహీనత వ్యాధి కలిగిన వ్యక్తులు తరచూ మంచినీరు, ఆరోగ్యవంతమైన పోషకాహారాన్ని తీసుకోవాలని, రక్తవృద్ధి కోసం ఫోలిక్ యాసిడ్ సప్లమెంటరీ మాత్రలు వాడేలా చూడాలన్నారు. తగినంత నిద్రపోవాలని, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలని, తీవ్రమైన చలి, వేడి ప్రాంతాలకు వెళ్లకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వీబీడీసీ జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రకాంత్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, రణధీర్, భూపాలపల్లి జనరల్ మెడిసిన్ నిపుణులు పవన్‌కుమార్, పిల్లల వైద్యనిపుణులు సురేందర్, సికిల్ సెల్ ములుగు జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రమోద్, డెమో సంపత్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌లు పూర్ణ, సంపత్‌రావు, డీడీఎంలు ప్రవీణ్, నిఖిల్, డీఈవో కిరణ్, ములుగు, భూపాలపల్లి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పిచ్చుకల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పిచ్చుకల పరిరక్షణకు ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం అన్నారు. కళాశాలలో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పిచ్చుకల పరిరక్షణకు బాధ్యత తీసుకుని వ్యవహరించినప్పుడే వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుత రోజుల్లో నగరీకరణ, కాలుష్యం, రసాయనిక భోజన పదార్థాల వల్ల పిచ్చుకల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. పిచ్చుకలకు గూళ్ల ఏర్పాటు, తాగునీటి పాత్రలు ఉంచడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, నాక్ కోఆర్డినేటర్ కవిత, అధ్యాపకులు సరిత, బి.శిరీష, నాగమణి, జగదీష్, విజిత, శంకర్, ఉదయశ్రీ, తేజోలత, శ్రీను, మౌలానా, రమేష్, అనిత, ఎస్.రమేష్, షరీఫా, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఏటూరునాగారం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 3వ వార్డుకు చెందిన మాజీ వార్డు సభ్యుడు సరికొప్పుల మొండయ్య మరణించగా ఆయన మృతదేహాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు(లక్ష్మణ్ బాబు) గురువారం సందర్శించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, ఎమ్డీ. వలిబాబా, జాడి బోజారావు, కాళ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

24 నుంచి బోర్‌వెల్స్ లబ్ధిదారుల ఎంపిక

వాజేడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో షెడ్యూల్ తెగ ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి బోర్‌వెల్స్ లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీవో శ్రీకాంత్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి 25 వరకు ప్రతి గ్రామ పంచాయతీలో పెసా గ్రామసభలను నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద విద్యుత్ లైన్‌కు సమీపంలో రెండు ఎకరాలకు తక్కువ కాకుండా పట్టా కలిగిన రైతులను గుర్తించి బోర్‌వెల్స్ వేయనున్నట్లు తెలిపారు.

కేజీబీవీని సందర్శించిన జీసీడీవో

కన్నాయిగూడెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పనపల్లి వద్ద ఉన్న కేజీబీవీని గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీవో) రమాదేవి గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్స్‌ను పంపిణీ చేశారు. ఆమె వెంట ఎస్‌వో అశ్విని ఉన్నారు.

సర్వే పారితోషికం చెల్లించాలి : ఉపాధ్యాయ సంఘాలు

భూపాలపల్లిటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో పనిచేసిన ఎన్యుమరేటర్లకు వెంటనే పారితోషికం ఇవ్వాలని ఉపాధ్యాయల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నక్క తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యిత తిరుపతి, ఎస్టీటీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ధర్మ టీచర్స్ యూనిటీ కాటారం మండలం కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ 2024 నవంబరులో ఎస్ఈఈఈపీసీ సర్వే చేసి జయశంకర్ జిల్లాను ముందు వరుసలో ఉంచామని అన్నారు. అయినప్పటికీ తమకు న్యాయంగా రావాల్సిన పారితోషికం ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

భూపాలపల్లిలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యో తి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక మసీదులో గురువారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు,బుర్ర కొంరయ్య, దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్ పాల్గొన్నారు.

యువజనోత్సవాలను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న వరంగల్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను విజయవంతం చేయాలని వరంగల్ నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన పోస్టర్‌ను విడుదల ములుగు జిల్లాలోని యువతీ యువకులకు వివిధ రకాలైన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యంగ్ రైటర్స్, యంగ్ ఆరిస్ట్, ఫొటో గ్రఫీ, ఉపన్యాసం, సంస్కృతిక జానపద నృత్యం(గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ (గ్రూప్, వ్యక్తిగత) పోటీలు ఉంటాయని వివరించారు. మరిన్ని వివరాలకు 9908069469, 9502449469 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

విషప్రయోగంతో గేదెల మృతి

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విషప్రయోగం జరిగి పశువులు చనిపోయిన ఘటన భూపాలపల్లి మండలం మోరంచపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొత్త సుదర్శన్ రెడ్డికి చెందిన తొమ్మిది గేదెలకు విషప్రయోగం జరగ్గా వాటిలో గేదెలు మృతి చెందినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి తెలిపారు. ఐదు గేదెలకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. విషప్రభావం జరిగిన గేదెలకు కుమారస్వామి గురువారం పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ తిరుపతి, గోపాలమిత్ర ప్రకాశ్‌రెడ్డి ఉన్నారు. విషప్రయోగం ఎలా జరిగిందనేది విషయంలో స్పష్టత ఇవ్వలేదు.

అనాథ బాలుడికి టైలర్ చేయూత

కాటారం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్నాటి బలరాం అనాథ బాలుడికి చేయూత అందించాడు. గురువారం తనవంతు సాయంగా రెండు కొత్త డ్రెస్సులను అందించాడు. మద్రిపల్లి గ్రామానికి చెందిన మేకల రాజు అనే 16ఏళ్ల బాలుడికి తల్లిదం డ్రులిద్దరూ చనిపోయారు. చెల్లిని చదివిస్తూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్న అతడి పరిస్థితిని చూసి బలరాం బట్టలు కొని కొలతలు తీసుకుని రెండు డ్రెస్సులు కుట్టి అందించాడు. గతంలోనూ బలరాం పలువురు అనాథలకు ఉచితంగా బట్టలు కుట్టి అం దించాడు. అనాథలకు ఉచితంగా బట్టలు కుట్టిస్తానని అంబేద్కర్ సెంటర్‌లోని తన షాపులో సంప్రదించాలని తెలిపాడు.

క్రైస్తవ హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడిగా రాజేష్



భూపాలపల్లిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ హక్కుల రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా కప్పల రాజేష్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ సంఘం జన్ను ఎర్మియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మార్పీఎస్ శ్రేణుల సంబరాలు

మహాముత్తారం, మార్చి20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలో సంబరాలు జరుపుకొన్నారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మారపాక లచ్చయ్య, పులియాల రాజయ్య, పంగ రాజయ్య, దేవేందర్, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

సింగరేణి క్వార్టర్స్ కేటాయిపునకు కౌన్సెలింగ్

కృష్ణకాలనీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెస్క్యూ స్టేషన్‌లో భూపాలపల్లి ఏరియా కార్మికుల బెటర్‌మెంట్ కౌన్సెలింగ్‌ను గురు వారం నిర్వహించారు. భూపాలపల్లి ఏరియాలో టీటూ, ఎండీ, వెయి క్వార్టర్స్‌తో పాటు రామప్పకాలనీలో మొ త్తంగా 83 ఖాళీలు ఉన్నాయి. వీటికి కార్మికులకు కౌన్సెలింగ్‌కు పిలవగా 352 మంది హాజరయ్యారు. వీరిలో 60 మంది తమకు నచ్చిన క్వార్టర్స్‌లను ఎంపిక చేసుకు న్నారు. ఇంకా 23 క్వార్టర్స్ మిగిలి ఉన్నాయని ఇన్‌చార్జి ఏరియా అధికార ప్రతినిధి గుండు రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అధికారులు కవీంద్ర, జె. వెంకటరమణ, రామకృష్ణరెడ్డి, రవికుమార్, కాంతి కుమార్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన టిప్పర్ క్యాబిన్

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


కుప్పకూలిపోయి ధ్వంసమైన టిప్పర్ క్యాబిన్

కృష్ణకాలనీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జాతీయ రహదారి మంజూర్‌నగర్ వద్ద వెళ్తున్న టిప్పర్ ఆకస్మాత్తుగా ముందు భాగం కుప్పకూలింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి 2 ఇన్‌క్లైన్ నుంచి టిప్పర్ బొగ్గు లోడుతో జెన్‌కోకు వెళ్తున్న క్రమంలో మార్గ మధ్యలో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రి ఎదురుగా రన్నింగ్‌లోనే టిప్పర్ క్యాబిన్ ముందుకు పడిపోయి ధ్వంసమైంది. మహాము త్తారం మండలం యామన్‌పల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయన్ను తొలుత వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అధిక లోడ్ మూలంగా ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ ముందు భాగం విడిపోయిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

అధికారులతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కాటారం సబ్ డివిజన్ సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. వేసవితో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం రాత్రి కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి మంత్రి పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, ఆర్‌డబ్ల్యూఎస్, ఐబీ, పీఆర్, అటవీ తదితర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండుతున్న ఎండలతో కాటారం, భూపాలపల్లి డివిజన్లలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలో 30 బోర్లు మంజూరు చేశామని, అవసరం ఉన్న గ్రామాల్లో వేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి ఎద్దడి రాకుండా చేయాలని అన్నారు. సబ్ డివిజన్ కేంద్రంలో మినీ స్టేడియం, పిల్లల పార్క్ ఏర్పాటుకు అధికారులు స్థల సేకరణ చేయాలన్నారు. కాటారం జీపీ భవనం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లో సౌర విద్యుత్ ద్వారా నీటి మోటార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కాటారం మండలంలో సీఆర్ఆర్ నిధులు మంజూరైన నాలుగు రోడ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలన్నారు. ఏసీడీపీ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాటారంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభించాలన్నారు. సబ్ డివిజన్‌లో అంబులెన్స్, వైకుంఠ రథాలకు నిధులు మంజూరయ్యాయని, వాటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాటారం, మహదేవపూర్ మండల కేంద్రాల్లో ఆర్టీసీ బస్టాండ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

ఇసుక లారీలతో ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా వాటి వేగాన్ని నియంత్రించడానికి వీడియో కెమెరాలు, స్పీడ్ గన్స్, ప్రత్యేక చెక్‌పోస్టులు, పార్కింగ్ ఏరియాలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. రహదారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తులకు సౌకర్యాల కల్పన కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. చిన్న కాళేశ్వరం పనులు పూర్తి చేయాలని, నిర్వాసితులకు పరిహారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, డీఆర్‌డీవో నరేష్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

తిమ్మపురంలో వనదేవతల జాతర


వన దేవతలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆదివాసీలు

మంగపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నిమ్మగూడెం గ్రామ పంచాయతీ పరిధి గిరిజన గ్రామమైన తిమ్మపురంలో ఆదివాసీ కుల దైవాలైన ముసలమ్మ, సమ్మక్క-సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రధాన ఘట్టం ఎదుర్కోలు గురువారం జరగ్గా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ చైర్మన్ కొమరం రామ్మూర్తి, రెక్కల రామక్క, ఆదివాసీ(గిరిజన) ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లాల మాజీ చైర్మన్ కొమరం నర్సయ్య, ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నెర్రెలు బారిన ఆశలు

చింతలచెరువు కింద ఎండిపోయిన వరి పంట

చెరువులో నీళ్లు స్వల్పం.. సాగులో అధిక విస్తీర్ణం

కాటారం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం శివా రు చింతలచెరువు కింద పలువురు రైతులకు చెందిన వరి పొలాలు నీళ్లందక నెర్రెలు బారి ఎండిపోతున్నాయి. చింతలచెరువు కింద గత ఏడాది యాసంగి సీజన్‌లో కన్నా అధిక విస్తీర్ణం ఆయకట్టులో వరి సాగు చేశారు. కట్టకు సమీపంలోని పలువురు రైతులు త్వరగా వరి నాట్లు వేసుకున్నారు. కొందరు తూముకు దూరప్రాంత రైతులు ఆలస్యంగా వెదజల్లే పద్ధతిలో యాసంగి వరి సాగు చేశారు. మండుతున్న ఎండలకు తోడు గత ఏడాది సెప్టెంబరు ఆఖరు వారం నుంచి వర్షాలు కురియకపోవడంతో చెరువులో నీళ్లు అడుగంటిపోయాయి. దీంతో సుమారు పదెకరాల్లో నీరందక పొలాలు నెర్రెలుబారి వరి పంట ఎండిపోయింది. ఒకరిని చూసి ఒకరు రైతులు బ్రాడ్‌కాస్టింగ్ (మొలక వెదజ ల్లడం) పద్ధతిలో వరి సాగు చేశారు. చెరువులో నీళ్ల అడుగంటిపోయిన దశలో పొలాలకు నీరందని పరిస్థితి తలెత్తి ఎండిపోతున్నాయి. దీంతో చేసేదేమీలేక రైతులు తమ ఎండిన పొలాలను పశువులు, గొర్రెల మేతకు వదిలేశారు. కాగా చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గారెపల్లి చింతల చెరువును రిజర్వాయర్‌గా మార్చి స్టేజ్-2 పంప్‌హౌస్ నుంచి నీటిని చెరువులోకి పంపింగ్ చేసే ప్రక్రియ ఈ యాసంగి సీజన్‌లోనే ప్రారంభమవుతుందనుకున్నామని, కట్టను బలోపేతం చేయడానికి చెట్లు, పొదలు తొలగించడంతో నీళ్లు వస్తాయని, గతం కన్నా అధిక విస్తీర్ణంలో వరి వేసుకుని నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నెర్రెలుబారి ఎండిపోయిన వరి పొలం


ఎండిపోతున్న పొలాల్లో మేస్తున్న గొర్రెలు

జాతీయ స్థాయి పోటీలకు ఎస్టీ గురుకులం విద్యార్థి


జితేందర్

కాటారం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ (బాలుర) గురుకుల కళాశాలకు చెందిన హ్యాండ్‌బాల్ అకాడమీ క్రీడాకారుడు జితేందర్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-19 విభాగంలో జితేందర్ అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి కరీంగనర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 26 నుంచి 30వరకు బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్(హెచ్ఎఫ్ఐ) పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున జితేందర్ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ రాజేందర్ వెల్లడించారు. గురువారం గురుకులంలో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని గురుకులం ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్, డిప్యూటీ వార్డెన్ నరేష్, అధ్యాపకబృందం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం

తాడ్వాయి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటాపూర్ గ్రామానికి చెందిన రాజలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో దశదిన కర్మకు క్వింటా బియ్యం, రూ. 20వేల ఆర్థిక సాయం చేశారు. నాయకులు లచ్చుపటేల్, సునీల్, ముజఫర్, సాంబయ్య, శ్రీనివాస్, నర్సింహాస్వామి పాల్గొన్నారు.